'డబుల్' ఇళ్ల బిల్లులేవి..?

- అప్పులు చేసి తిప్పలు పడుతున్న లబ్ధిదారులు
- బిల్లులు రాక ఆస్తులు అమ్ముతున్న వైనం
- పట్టించుకోని పాలకులు
- అసంపూర్తి ఇంటిలోనే జీవనం



నస్రుల్లాబాద్‌లో అసంపూర్తిగా నిర్మించిన ఇల్లు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): సొంత స్థలాల్లో డబుల్ బెడ్రూం ఇల్లు నిర్మించుకుంటే రూ.5లక్షలు వస్తాయని చెప్పడంతో అప్పులు చేసి మరీ ఇంటి నిర్మాణం చేపట్టారు. కాని ప్రభుత్వం మారడంతో డబుల్ బెడ్ రూం ఇళ్ల పూర్తయినా కూడా బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు వారు ఇళ్ల పైకి వచ్చి ఇబ్బంది పెడుతున్నారు. పొలం, బంగారం అమ్ముకుని అప్పులు చెల్లిస్తున్నారు. మరి కొంత మంది సగం నిర్మించుకున్న ఇంట్లోనే ఉంటున్నారు. కాస్తో కూస్తో బిల్లు వచ్చిన వారు దాదాపు ఇంటి నిర్మాణం చేసుకున్నారు. కాని పూర్తి చేసుకునే స్తోమత లేకపోవడంతో అసంపూర్తి ఇంటిలోనే జీవిస్తున్నారు. మరి కొంత మంది ఇంటి అప్పు తీర్చడానికి కుటుంబంతో సహా వలస వెళ్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఇంటి బిల్లులు వెంటనే అందించాలని కోరుతున్నారు.

నియోజకవర్గానికి రూ.27.80 కోట్లు

రాష్ట్ర వ్యాప్తంగా డబుల్ ఇళ్ల నిర్మాణంలో పేరుగాంచిన నియోజకవర్గం బాన్సువాడ. యుద్ధ ప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు కొంత మేర బిల్లులు చెల్లించారు. కాని మరో రూ.27.80 కోట్ల బిల్లులు రావాల్సి ఉందని బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి బాహాటంగానే చెబుతున్నారు. మరి కొన్ని రోజుల్లో ఈ బిల్లులు చెల్లించకుంటే లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులతో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తానని లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో నస్రుల్లాబాద్‌లో మాట్లాడారు.

నస్రుల్లాబాద్‌లో రూ.3.57కోట్లు..

నస్రుల్లాబాద్‌కు రూ.96 లక్షలు ,లింగపల్లి తండాకు రూ.10 లక్షలు, మైలారం రూ.45 లక్షలు, బొమ్మన్ దేవ్‌పల్లికి రూ.25లక్షలు, నెమ్లికి రూ. 30 లక్షలు, కామిశెట్టిపల్లికి రూ.25 లక్షలు, రాములగుట్ట తండాకు రూ.8 లక్షలు, నాచుపల్లి తండాకు రూ.4 లక్షలు, నాచుపల్లికి రూ.10 లక్షలు, దుర్కికి రూ.40 లక్షలు, బస్వాయిపల్లికి రూ.4 లక్షలు, అంకోల్‌కు రూ.18 లక్షలు, అంకోల్ తండాకు రూ.5లక్షలు, సంగంకు రూ.30 లక్షలు, హాజీపూర్‌కు రూ.7 లక్షలు రావాల్సి ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

అసంపూర్తి ఇంటిలోనే ఉంటున్నాం



ఇంటి బిల్లులు అందిస్తాం అనడంతో అప్పులు చేసి మరీ ఇంటి నిర్మాణం చేపట్టాము. చేతిలో కూడబెట్టిన డబ్బుతో మొదలెట్టాము. కొంత బిల్లు ఆసరాగా మారింది. కాని పూర్తి బిల్లు రాకపోవడంతో అసంపూర్తి ఇంటిలోనే ఉంటున్నాం. బిల్లు ఇప్పిస్తే పూర్తి చేసుకుంటాము.

– లావణ్య, నస్రుల్లాబాద్

అప్పులు కట్టినా తీరడం లేదు



డబుల్ బెడ్‌రూం ఇల్లు వస్తుందన్న ఉద్దేశంతో మొదలెట్టి పూర్తి చేెము. కాని అర్ధ ఎకరం పొలం అమ్మినా, బంగారం అమ్మినా కూడా అప్పులు ముట్ట లేదు. నాయకుల దగ్గరకు వెళ్తే హీనంగా చూస్తున్నారు. అప్పుల వారు ఇంటి మీదకు వస్తున్నారు. డబ్బులు త్వరగా ఇప్పించాలి.

– అనిత, నస్రుల్లాబాద్

'అమ్మ ఆదర్శ' నిధులతో అభివృద్ధి పనులు

- సాదాసీదాగా బాన్సువాడ మండల సర్వసభ్య సమావేశం
- సర్పంచ్‌ల స్థానంలో హాజరైన ప్రత్యేకాధికారులు



బాన్సువాడలో ప్రగతి నివేదిక చదువుతున్న ఎంఈవో నాగేశ్వరరావు

బాన్సువాడ రూరల్: అమ్మ ఆదర్శ పాఠశాల పథకం నిధులతో ప్రభుత్వ పాఠశాలను నూతన హంగులతో అభివృద్ధి చేస్తున్నట్లు మండల విద్యాధికారి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం బాన్సువాడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో 60 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఇప్పటికే 22 పాఠశాలలకు అంచనా వ్యయంలో 25 శాతం నిధులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అకౌంట్లలో జమయ్యాయన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి అన్ని పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ పనుల్లో భాగంగా అన్ని పాఠశాలలకు గ్రీన్‌చాక్ బోర్డులు, డ్యూయల్ డెస్కులు, పాఠశాల భవనాలకు రంగులు వేయిస్తున్నట్లు తెలిపారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న మెరుగైన వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెట్లను నరికేస్తున్నారు..

అంతకు ముందు ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం కోట్లాది నిధులు వెచ్చించి హరిత హారంలో భాగంగా నాటి, సంరక్షించిన చెట్లను అడ్డగోలుగా నరికివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. బోర్లం క్యాంపు -బోర్లం రోడ్డు పనులు నెలలు గడుస్తున్నా పూర్తికాలేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వెంటనే పూర్తిచేయించాలని గ్రామ ఎంపీటీసీ శ్రావణి దేవేందర్‌రెడ్డి కోరారు. అలాగే పలువురు సమస్యలను లేవనెత్తారు. స్త్రీశిశుసంక్షేమ, సాంఘిక సంక్షేమ, ప్రజా ఆరోగ్య శాఖల ప్రగతి నివేదికలపై చర్చించారు. సోమవారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశానికి 11 మంది ఎంపీటీసీలకు గానూ ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. జెడ్పీటీసీ సహా, బుడిమి, తిర్మలాపూర్, ఇబ్రహీంపేట్, బోర్లంక్యాంపు ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. కాగా సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో వారి స్థానంలో 25 మందికి గానూ సగానికి పైగా ప్రత్యేకాధికారు గైర్హాజరయ్యారు. ఎంపీడీవో బషీరుద్దీన్, వైస్ ఎంపీపీ హరిసింగ్, సొసైటీ చైర్మన్లు కృష్ణారెడ్డి, గంగారాం, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న బీర్కూర్ ఎంపీపీ రఘు

బాన్సువాడ రూరల్/బాన్సువాడ: రైతులకు నకిలీ ఎరువులు, పురుగుల మందులు, ఎరువులు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని బీర్కూర్ ఎంపీపీ తిలకేశ్వర్ రఘు హెచ్చరించారు. వానాకాలం పంటల సాగు ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తుగా బీర్కూర్ రైతు వేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విత్తనాల డీలర్లు, పురుగులు, ఎరువుల మందు దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని, తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. గత ఎండాకాలం సీజన్‌లో నకిలీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇలాంటి ఘటన పునరావృతం కారాదని అన్నారు. ఏవో కమలకిషన్, ఎంపీడీవో భారతి, ఏఈవోలు శ్రావణ్ కుమార్, చిట్టంపల్లి కావ్యశ్రీ, సహకార సంఘాల అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



దోమకొండలో జీపీ కార్యాలయాన్ని సందర్శించిన అధికారులు

దోమకొండ: కేంద్ర ప్రభుత్వ అధికారులు సోమవారం దోమకొండ గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామంలో ప్రభుత్వ నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల గురించి తెలుసుకోవడానికి నాలుగు రోజుల పాటు ఇక్కడ ఉండనున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. గ్రామ పంచాయితీ పరిధిలో జరిగిన ఉపాధి హామీ పథకంతో పాటు పలు ఇతర అభివృద్ధి పనులు, నిధుల వినియోగం తదితర అంశాలపై పరిశీలన చేయనున్నట్లు వారు వివరించారు. బృందంలో సెక్రటేరియట్ అసిస్టెంట్ సెక్షన్ అధికారులు సత్యం తివారి, దివ్యజైన్, త్రీప్తి, ఇందుసింగ్, రోహిత్‌యాదవ్, పంకత్‌పోల్, ఎంపీడీవో రమేష్, ఐసీడీఎస్ సీడీపీవో రోశమ్మ, ఎంపీవో తిరుపతిరెడ్డి, పంచాయితీ కార్యదర్శి సౌజన్య, తదితరులు ఉన్నారు.

శివాయిపల్లికి అధికారుల రాక

రాజంపేట: శివాయిపల్లి గ్రామానికి సోమవారం కేంద్ర ప్రభుత్వ అసిస్టెంట్ సెక్షన్ అధికారులు విచ్చేసినట్లు ఎంపీడీవో రాజేశం తెలిపారు. గ్రామంలో ఐదు రోజులపాటు ఫౌండేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా విచ్చేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీవో రఘురాం, పంచాయతీ కార్యదర్శి అరుణ్ తదితరులు పాల్గొన్నారు .



శివాయిపల్లిలో సమావేశమైన అధికారులు

గుర్తింపు లేని పాఠశాలల్లో చేర్చొద్దు


కామారెడ్డి రూరల్: అనుమతి లేని బడుల్లో పిల్లలను చేర్పించవద్దని కామారెడ్డి ఎంఈవో ఎల్లయ్య సూచించారు. కామారెడ్డి మండలంలోని శాంతినికేతన్ పాఠశాలకు అనుమతి ఉంది కానీ శాంతి నికేతన్ రస్‌బై ఎస్ఎస్ఆర్ ఇంపుల్స్‌కి ఎలాంటి అనుమతి లేదన్నారు. అలాగే ఛాంపియన్ హైస్కూల్, న్యూటన్ స్కూల్, హర్ష స్కూల్, ప్రెసిడెన్షియల్ స్కూల్‌కు ఎలాంటి అనుమతులు లేవని ఈ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిస్తే తాము ఎలాంటి బాధ్యత వహించమని, పిల్లల తల్లిదండ్రులు గమనించాలని కోరారు. గుర్తింపు లేని పాఠశాలల్లో పిల్లలను చేర్చే ముందు సంబంధిత మండల విద్యాశాఖాధికారిని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

ప్రతి నెలా సమావేశాలు నిర్వహించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మహిళా సంఘాల సభ్యులు ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి లావాదేవీలను చూసుకోవాలని ఐకేపీ ఏపీఎం జగదీష్ అన్నారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో ఆయన మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలకు సంబంధించిన నెలవారీ వాయిదాలను సకాలంలో చెల్లించాలని అన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, సీసీలు రమేష్, దత్తు తదితరులున్నారు.

కరెంట్ తీగలను తొలగించాలి



కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి చెరువు సమీపంలోని 11కేవీ కట్టకింది ట్రాన్స్‌ఫార్మర్‌లకు సంబంధించిన కరంట్ తీగలు చాలా కిందకి ఉన్నాయని రైతులు తెలిపారు. దీంతో వరి కోసే సమయంలో వరి కోత మిషన్లకు కరంట్ తీగలు తాకుతున్నాయని, తమకు వరి కోయడానికి మిషన్లు రావడం లేదని, ట్రాన్స్‌కో అధికారులు స్పందించి వ్యవసాయ భూములకు అడ్డంగా ఉన్న కరెంట్ తీగలను తొలగించి తమ సమస్యను తీర్చాలని రైతులుఅంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య, రాఘవేంద్ర కోరారు.

ఓపెన్ జిమ్ పార్కును సందర్శించిన చైర్‌పర్సన్



కామారెడ్డి టౌన్: పట్టణంలోని గోదాంరోడ్‌లో గల మున్సిపల్ పార్కు, ఓపెన్ జిమ్‌ను సోమవారం ఉదయం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ సందర్శించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓపెన్ జిమ్‌కు సంబంధించిన పరికరాలు చెడిపోవడంతో వాటికి మరమ్మతులు జరిపిస్తామని, అవసరమైతే కొత్త పరికరాలు బిగిస్తామని, పార్క్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డు సమస్యలను మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యురాలు పుల్లూరి జ్యోతి చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్లు పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ, నాయకులు ప్రసాద్, సలీం పాల్గొన్నారు.

వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి



రైతులకు నచ్చజెప్పుతున్న ఎస్సై సుధాకర్

బీబీపేట: ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, వారం రోజులుగా కాంటాలు బంద్ ఉన్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మల్కాపూర్ గ్రామానికి చెందిన రైతులు సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎక్కడి వడ్లు అక్కడే ఉండడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని లారీలను తెప్పించి వెంటనే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న డీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అక్కడకు చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. అధికారులతో మాట్లాడి వెంటనే కొనుగోలు ప్రారంభించారు. ఆయన వెంట డైరెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

నిజాంసాగర్‌లో రాస్తారోకో..

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై సోమవారం మాగి గ్రామ రైతులు వరి ధాన్యం తూకం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. తూకం వేసి వరిధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడం లేదని చెబుతూ రైతులు రాస్తారోకోకు దిగారు. ఒక్కొక్క బస్తాకు మూడు కిలోల చొప్పున రైస్ మిల్లర్లు తరుగు తీస్తున్నారని రైతులు వాపోయారు. విషయం తెలుసుకున్న ఎస్సై సుధాకర్, తహసీల్దార్ భిక్షపతి, సొసైటీ సీఈవో సంగమేశ్వర్ గౌడ్ అక్కడి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు.

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం



రైతులతో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్

భిక్కనూరు: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య అన్నారు. అకాలవర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకునేందుకు బస్వాపూర్ శివారులోని పూర్ణ రైస్‌మిల్ యాజమాన్యం అభ్యంతరం తెలుపడంతో కాచాపూర్ రైతులు ఆందోళన చేశారు. ఈ విషయం తెలిసి డిప్యూటీ తహసీల్దార్, రైస్ మిల్లు యాజమాన్యాన్ని ఒప్పించి అన్‌లోడ్ చేయించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ నాలుగు రోజుల్లో మొత్తం ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. రైతు నాయకులు అనిల్ కుమార్, పూస శంకర్, కామిండ్ల రాజం, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ



పంపిణీ చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

బిచ్కుంద(జుక్కల్): పుల్కల్ సొసైటీలో అధికారులు రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. సోమవారం సాక్షి దినపత్రికలో జీలుగ విత్తనాల కోసం రైతుల ఎదురుచూపులు.. అని వచ్చిన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. సొసైటీ కార్యదర్శి సాయి ప్రకాష్, వ్యవసాయ అధికారులు రాయితీపై జీలుగ విత్తనాలు అందించారు. 30 కేజీల విత్తన బ్యాగు 40 శాతం రాయితీపై రూ.1,116 అందజేశారు. అవసరం ఉన్న రైతులు సొసైటీలో నుంచి తీసుకెళ్లాలని కోరారు.

బీర్కూర్, దామరంచ సొసైటీల్లో..



బీర్కూర్‌లో పంపిణీ చేస్తున్న ఏవో కమల

బాన్సువాడ రూరల్/బాన్సువాడ: బీర్కూర్, దామరంచ సొసైటీల్లో సోమవారం జీలుగ విత్తనాల పంపిణీ ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారిణి కమల కిషన్ తెలిపారు. ఒక్కో సహకార సంఘంలో ప్రస్తుతం 166 బస్తాల చొప్పున అందుబాటులో ఉంచామన్నారు. 30 కేజీల బస్తాధర రూ.2790 కాగా తెలంగాణ ప్రభుత్వం రూ.1674 సబ్సిడీ భరించి రూ.1116కే రైతులకు అందిస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు జీలుగ ద్వారా భూసారాన్ని పెంచుకోవాలని కోరారు. ఏఈవోలు శ్రావణ్ కుమార్, కావ్యశ్రీ, కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు.

అలరించిన మల్లయోధుల కుస్తీ పోటీలు



నిజాంసాగర్(జుక్కల్): నల్లపోచమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఒడ్డేపల్లిలో నిర్వహించిన కుస్తీ పోటీలు ప్రేక్షకులను అలరించాయి. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి మల్లయోధులు తరలి రావడంతో కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. కుస్తీ పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు నిర్వాహకులు ప్రజా పండరి నగదు బహుమానంగా అందజేశారు. గ్రామ నాయకులు బొజ్జ అంజయ్య, రాజారాం, రాములునాయక్ తదితరులున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని తుంకిపల్లి వడ్డెర కాలనీ నుంచి కుమ్మరి చెరువు వరకు సోమవారం ఫార్మేషన్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద ఫార్మేషన్ రోడ్డు మంజూరైంది. పంటపొల్లాల్లో ఇరువైపులా ఉన్న మట్టిని ఉపాధి కూలీలు తవ్వుతూ ఫార్మేషన్ రోడ్డు ఏర్పాటు చేయనున్నారు.



ఆధ్యాత్మికం

నరసింహుడి ఆలయంలో ధ్వజారోహణం



మాచారెడ్డి: లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు, సిబ్బంది సంతోష్, లక్ష్మణ్, అర్చకులు ఉన్నారు.

రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం

దోమకొండ: మండల కేంద్రంలో సోమవారం రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం తిరుగు బోనాలు, పుట్ట ఎల్లమ్మ వద్ద పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగభూషణం గౌడ్ తెలిపారు.

పంచముఖ శివలింగానికి అభిషేకాలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లి గ్రామంలోని షిర్డి సాయి ఆలయ ప్రాంగణంలో ఉన్న పంచముఖ శివ లింగాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి వారం ఉదయం అభిషేకం,అర్చనలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు.

ఘనంగా గంగమ్మ ఆలయ వార్షికోత్సవాలు



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామంలో బేస్త సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గంగమ్మ ఆలయం రెండో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయం వద్ద వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బేస్త సంఘం సభ్యులు పెద్ద విఠల్, పెద్ద అంజయ్య, సంతోష్, రమేష్, కుపేందర్ తదితరులు ఉన్నారు.

నేడు గంగమ్మ బోనాల ప్రదర్శన

నర్వ గ్రామ గంగమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం బోనాల ప్రదర్శ నిర్వహిస్తున్నట్లు బేస్త సంఘం సభ్యులు తెలిపారు. ఇంటికో బోనం, శివసత్తుల పూనకాలు, బ్యాండు మేళాల మధ్యన అమ్మవారికి బోనాల ప్రదర్శ జరుపుతామని చెప్పారు.

క్లుప్తంగా

మున్నూరుకాపు విద్యార్థులకు అభినందన



కామారెడ్డి అర్బన్: సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన మున్నూరుకాపులు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని మున్నూరుకాపు సంఘం జిల్లా నాయకులు అన్నారు. సోమవారం స్థానిక వశిష్ట డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పదవ తరగతి, ఇంటర్‌లో ప్రతిభావంతులైన జిల్లాలోని 70 మంది మున్నూరుకాపు విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించడంతో పాటు సన్మానం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మామిండ్ల అంజయ్య మాట్లాడుతూ.. ప్రతిభగల మున్నూరుకాపు పేద విద్యార్థులకు చదువుకోవడానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. సంఘం ప్రతినిధులు బి.లలిత, శ్రీకాంత్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి కోసం సోమవారం గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణు గోపాల్ రావు, వీణ దంపతుల తరపున ఆ ఫ్యాక్టరీ అసిస్టెంట్ మేనేజర్ బాల్ రాజు ఆలయ సిబ్బందికి రూ.11వేలు అందజేశారు. అలాగే ముంబైకి చెందిన క్యాదరి రాజేందర్, ఉమ దంపతులు రూ.5 వేలు అందజేశారు. దాతలకు స్వామివారి చిత్ర పటాలను అందజేసి సత్కరించారు.

గరుడ ప్రసాదం పంపిణీ

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ధ్వజారోహణం నిర్వహిస్తున్న సందర్భంగా 35 జంటలకు గరుడ ప్రసాదం పంపిణీ చేశారు.

మరమ్మతులు



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని తిమ్మనగర్ రహదారిపై పక్కన ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజ్ కావడంతో సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదగిరి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలో ఎక్కడైనా మంచినీటి పైప్‌లైన్ లీకేజీ అయితే వెంటనే తెలియజేయాలని, నీరు కలుషితమైతే ప్రజలు అనారోగ్యానికి గురికాకుండ ఎప్పటికప్పుడు మరమ్మతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

బోరుబావి తవ్వకం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బీసీ కాలనీలో కొన్ని రోజుల క్రితం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ బోరుబావిని వేయించారు. బోరు బావిలో నుంచి నీరు వచ్చినప్పటికి కేసింగ్ పైపు వేయలేక పోవడంతో బోరును వాడలేదు. ఈ విషయమై కేసింగ్ పైప్‌కోసం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను గ్రామ పెద్దలు డబ్బులను అడుగగా ఎమ్మెల్యే నిధులు ఇవ్వడంతో కేసింగ్ పైపును వేయించారు. బోరు నుంచి వచ్చేనీటితో రెండు ట్యాంకులు నింపవచ్చని గ్రామపెద్దలు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహన ధ్రువీకరణ పత్రాలు లేనివారికి, సీటు బెల్టులు పెట్టుకోని, హెల్మెట్లు ధరించని వారికి జరిమానాలు విధించారు. పెండింగ్ చలాన్లు ఆన్‌లైన్ ద్వారా కట్టేలా చర్యలు తీసుకున్నారు.

24న మండల పరిషత్ సమావేశం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగవర్ధన్ తెలిపారు. ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు అధ్యక్షతన మండల పరిషత్ సమావేశంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి గౌరవ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.